# తాహతు మాలిన పరుగు

"ఏమో యేం చేస్తారో చివరికి. మీరు కష్టపడుతూ వుండడం నిజమే. నేను లేదనడం లేదు. వెన్నప్పంలా పెంచుకున్నాం అమ్మాయిని. మానాన్న ఆశీర్వచనం చేతనూ, మా అమ్మ పేరింటి దవడం చేతనూ అది తెలివయింది కూడా అయింది. బి.యే. పరీక్ష యిచ్చిన వాణ్ణేనా తేకపోతే తరవాత మన కోసం యేడుస్తుందది" అని వెంకు సోదెమ్మ చెప్పగా "నా శక్తి వంచన లేకుండా తిరుగుతున్నాను చూస్తున్నావా? అమ్మాయి సుఖపడుతూ వుంటే నేను చూడలేనూ? తెల్లారేటప్పటికి ఈ సంబంధం అస్తో బిస్తో తేల్చుకుని వస్తాను" అని గోపాలయ్య బండి యెక్కి వెడలిపోయెను. నరసమ్మ యదృష్టమును గుఱించి యోచించుకొనుచు సోదెమ్మ లోపలకు బోయెను.

ఆ దంపతులకు నరసమ్మ ఒక్కతెయే కూతురు. ఇప్పుడామె పంద్రెండేండ్ల పిల్ల. బడిలో నాలుగవ తరగతి చదివినది. చామనచాయ అయినా రూపవతియే "పాదాలు బాగున్నాయి గాదురా" అని యొకరిద్దరు పెళ్ళికొడుకులు ప్రచ్ఛన వేషముతో ఆమెను చూచుటకు వచ్చినపుడనుకొనిరి; గాని యీమాట చాల రహస్యముగనే యున్నది.

సోదెమ్మ బిడ్డ విషయమున చాల కష్టపడినది. ఆమెకి సుఖమూ, ఆనందమూ కలగడానికీ, తెలివితేటలు రావడానికీ అనేక విధముల ప్రయత్నములు చేసినది. ఏమీ లోపము చేయలేదు. కూతురు గూడ ఆమె ప్రయత్నమునకు తగినట్టుగనే బుద్ధిమంతురాలు అయినది. ఆమె సుఖమునకు మేఱలేదు.

ఒకనాడు నరసమ్మ బడిలో నుండి వచ్చి అప్పుడే బడి బట్టలు విడిచి తల్లితో మాట్లాడుచున్నది. పదకొండేళ్ళున్నవి. ఎందుకో చకచక మాట్లాడుచున్నది. ఈ సమయమున ఒక పరదేశి బ్రాహ్మణుడు వచ్చి "మీ అమ్మాయి చాలా తెలివైనదవుతుంది. ఏమీ లోటు వండదు. బి.యే. చదువుకున్న వాడు మొగుడవుతాడు. వుద్యోగస్థుడి పెళ్ళాం అవుతుంది. మొత్తానికి చాలా అదృష్టవంతురాలు" అని చెప్పెను. సోదెమ్మ "కూచోండి నాయనా! వారు వూళ్ళో లేరు. మీదే వూరండి?" అనియెను. "కృష్ణాతీరం మాది. జ్యోతిషం చదువుకున్నాను నేను. సాముద్రికంలో – నేను చెప్పుకోవడం మంచిదికాదు; గాని లేకపోతే నా సంగతి యీ క్రొత్త వూళ్ళో యెవరికి తెలుస్తుందీ? కూతురికి పెళ్ళి చేయవలసి వుంది. బీదవాణ్ణి. రెండుమాసాల నుంచి తిరుగుతున్నాను. యింకొక్క నెల తిరిగితే చాలు. వూళ్ళో వాకబు చేయగా యిక్కడ తప్ప యీపూటకి భోజనం దొరకదన్నారు. అన్నపూర్ణ తల్లివి. యింత గొడ్డువూరు చూళ్ళేదు నేను. దమ్మిడీ

అయినా దొరికింది కాదు" అని యాతడు కూర్చుండెను.

భోజనానంతరము కౌమార్తను గురించి చాల విధముల ప్రశ్నించి తెలిసికొని ఆనందించి సోదెమ్మ రెండు రూపాయలు బహుమతీ యిచ్చి అతని బంపివేసెను.

## 2

అప్పటికప్పుడే ఆమె నరసమ్మ వివాహమును గురించి యోచనలు చేయుచున్నది. దీనితో నుత్సాహము అధికము కాగా భర్తను తత్ప్రయత్నములలో ప్రవేశపెట్టినది. "బి.యే. అయితేగాని ఒప్పుకోను. బి.యే. చదువుతూనేనా వుండాలి. మన యెనిమిదెకరాల భూమీ, యీనాలుగిళ్ళ లోగిలీ పిల్లవే గనక మంచి సమ్మంధం తీసుకురావాలి. "ముందు ముందు ఆస్తి మాకు వచ్చేదయినా యిప్పుడు తగిన కట్నం యిస్తేగాని మేం వప్పుకోమ"ని యెవరేనా అంటే ఆ సమ్మంధం మంచిదయితే అలాగే యిద్దాము. సమ్మంధంలోగాని పెళ్ళి చెయ్యడంలోగాని యేంలోటు జరిగినా నేను వప్పుకోను" అని యామె ఖచ్చితముగా చెప్పెను.

అది మొదలు గోపాలయ్య వరాన్వేషణము ప్రారంభించెను. ఎన్ని రకాల సంబంధాలో వాకబు చేసెను. ఎందఱినో చూచెను. ఒకటియు సోదెమ్మకు నచ్చలేదు. "బి.యే. అంటే బి.యే. పరీక్ష అయితే చాలా? కోతిలా వున్నాడు పెళ్ళికొడుకు" అనియు, "మొగం నిండా పోటకం మచ్చలే. బొజ్జకూడానూ. వెండ్రుకలు జనపనారలా గున్నాయి. డోకొస్తోందండీ" అనియు, "ఈ సమ్మంధం యిదివరకే విన్నాను నేను. అత్తగారు గడ్డుదిట. ఇద్దరు ఆడబడుచులు యిల్లు పట్టేరుట" అనియు "తాటిచెట్టులాగ పొడుగండీ. క్రాపింగు వుంచుకోక ఆ డిప్పయేమిటీ నెత్తిమీదా? కొంగకాళ్ళూ, కాకిచూపు గూడాను. ఛా. ఈన్నిం. వాడికి పెళ్ళవుతుందా? యిలాంటివాణ్ణి చూపించడానికి మీకెలా తోచిందండీ?" అనియు "కుదిమట్టంగా బాగానే వున్నాడు కాని పిల్లికళ్ళు. క్రాపింగు దువ్వుకుంటే బాగానే వుంటుందేమో గాని ఆ పిలక యెందుకూ? కొంచెం మోటుగా వున్నాడు. నవ్వితే అట్టే బాగా లేదు. మాట కొంచెం తొందర. దర్జా అక్కర్లేనట్లుంది" అనియు ఇట్లనేకుల ననేకవిధములుగా నామె విమర్శించెను.

గోపాలయ్యకు విసుగు వచ్చినది. ఒకనాడు కోపపడి "నువ్వు చూసుకో నావల్లగాదు యింక" అని రెండుదినములు ఆప్రస్తావము చేయకుండ నూరకుండెను; గాని చివరకు తప్పినది గాదు. పునఃప్రయత్నపు ప్రారంభ నిమిషములలో నాతడు కొంచెము రుంజుకొని మఱల పనిలో ప్రవేశించెను. తరువాత ఒకటి రెండు సంబంధములు చూచెను; గాని అవి యాతనికే నచ్చలేదు.

## 3

ఆతనికి విసుపు కలిగింది. "దాని యోగం యెలా వుంటే అలా అవుతుంది" అని యాతడు అదే తుది ప్రయత్నముగా భావించుకొని అమలాపురము బయలుదేరెను. "మీరు వక్కరూ వెళ్ళడం గాదండీ. సంవత్సరాన్నుంచి తిరుగుతున్నారు, ఎక్కడా మంచి సమ్మంధం చూళ్ళేకపోయారు. పన్నిండేళ్ళు వెడతాయి అమ్మాయికి. యిక ఆపడానికి వీల్లేదు. యేం తెలుసునూ మీకూ? పదండి నేను కూడా వస్తాను" అని సోదెమ్మ కూడా వెంట బడెను. నరసమ్మను వారు రామచంద్రపురమున అమ్మమ్మ వద్ద నుంచిరి.

అమలాపురమున వారు సత్రములో మకాము చేసి వాకబు ప్రారంభించిరి. మొదటిదినము పైపై విచారణతో గడచిపోయెను. "నవుడూరి లచ్చయ్య అంటే అసాధ్యుడు. డబ్బు లాగడంలో భల్లూకప్పట్టూ. కొండ నాలిక లేదు; కాని వెయ్యిరూపాయలు వస్తాయి. వక్కకొడుకూ వక్క కూతురూనూ. ఏమాత్రమో దగ్గిర నిలవ వుంది" అని వారికి ఒక బ్రాహ్మణుడు చెప్పెను. "వరుడు చాలా అందమైన వాడు. బి.యే. చదువుతున్నాడు" అని గూడ నాతడు చెప్పగా "ఇక దాపరికాలెందుకూ?" అని వారు ప్రత్యక్షముగా రాయబారము ప్రారంభించిరి.

వీరు వెళ్ళునప్పటికి లచ్చయ్య శయనించి యుండెను. పెండ్లికొడుకు - శేషగిరిరావు వాకిట కూర్చుండి యేదో వ్రాసికొనుచుండెను. పురోహితుడు సంగతి చెప్పగా వియ్యపురాలు యజమానుని లేపెను.

ఉచిత మర్యాదలన్నియు ముగిసిన తర్వాత లచ్చయ్య కొడుకుని రావించి వారి యెదుట నిలిపెను. "అమ్మాయికి తగినవాడు" అని సోదెమ్మ సంతసించెను. ఆమె ముఖము మీది ఆనందచిహ్నములను గాంచి గోపాలయ్య "బ్రతికేను" అనుకొనియెను.

ఒకరి సంగతి యొకరికి తెలిసెను. "వేయిన్నూటపదార్లూ, ఉభయఖర్చులూ పెట్టుకోవాలి. వచ్చిన వారికందరికీ బట్టలు - స్వదేశీవి పనికిరావు" అని లచ్చయ్య చెప్పెను. "రేపు చెబుతాము" అని వీరు మకామునకు వచ్చిరి.

రాత్రి యంతయు కష్టనిష్ఠురములను గురించి యోచనలు జరిగెను. "ఈపిల్లాడిని దాటిపోనియ్యవద్దు" అని సోదెమ్మ దృఢముగా చెప్పగా "అయితే వేయిన్నూటపదహార్లూ, ఉభయఖర్చులూ పెట్టుకోవాలి" అని గోపాలయ్య అనియెను. "వప్పుకోండి" అని సోదెమ్మ చెప్పెను.

మరునాడు ఉదయము ఎనిమిది గంటలకు పురోహితుడు ముందు నడువగా వీరు నవుడూరి వారి యింటికి వెళ్ళిరి. గోపాలయ్య కొంచెము సేపు

బేరములు చేసి తుదకు నిన్నటి బేరమున కంగీకరింపగా "పెళ్ళికొడుకుతో మాట్లాడండి" అని లచ్చయ్య చెప్పెను. "ఇదేమిటి?" అని గోపాలయ్య సందేహించుచుండగా లచ్చయ్య కొడుకును బిలిచి సంగతి యంతయు జెప్పెను. శేషగిరిరావు "ఆ సంగతులన్నీ నాకక్కరలేదు. ఏదో మేళం తెస్తారేమో. మండపేటలో పేరుపొందిన భోగం మేళమూ, కాకినాడలో పేరు పొందిన బ్యాండూ, వెండి మరచెంబూ, క్షీరాబ్ధి తాపితాల చాపూ తేవాలి" అని చెప్పి వెడలిపోయెను. అయిదు నిముసములు గుసగుసలాడుకొని వారందులకు గూడ నంగీకరింపగా లచ్చయ్య "వియ్యపురాలితో మాట్లాడండి" అనియెను.

గోపాలయ్య ఉలికిపడియెను. సోదెమ్మ మ్రాన్పడెను. వీరింకను తేరికొనక పూర్వమే లచ్చయ్య పిలువగా వియ్యపురాలు వచ్చెను. "నేను చెప్పేదేమిటీ? అచ్చటా ముచ్చటా వారికి తెలవదు కనకనా? అయిదురోజులూ అయిదు పెద్దకాసులు నాకూ, అయిదు పెద్దకాసులు పిల్లకీ యివ్వాలి. అయిదురోజులూ చీరలివ్వాలి. అందులో రొండు చీరలు బనారసువీ, రొండు దక్షిణాదివీ వుండాలి. వెండి చేపలనీ, వెండి కోడిగుడ్లు అనీ యిలాంటివన్నీ చెప్పక్కర్లేదు. పానకబ్బిందెలు రెండు ఇవ్వాలని మనం చెప్పనే అక్కర్లేదు" అని యామె గ్రుక్క త్రిప్పుకొనకుండ గడగడ చెప్పెను. గోపాలయ్య "మధ్యాహ్నం వచ్చి చెబుతాము" అనియెను. "సమయానికి పిల్ల అత్తారింటో వుండిపోయింది. అది యింకా యేం కావాలంటుందో యేమిటో" అనుకొనుచు వియ్యపురాలు లోపలకు బోయెను.

## 4

గోపాలయ్యకు చీమలును జెఱ్ఱెలును ప్రాకినట్లుండెను. "ఏమంటావు?" అని యాత డడుగునంతవఱకును సోదెమ్మ మాట్లాడలేదు.

"సమ్మంధం మంచిదండీ"

"సొమ్ముమాట?

"అది నాకేం తెలుస్తుందీ?"

"రమారమీ నాలుగు వేలవుతాయి."

"వెండిచెంబు మా అమ్మ యిస్తుంది."

"సముద్రంలో కాకి రెట్ట. రుణం చెయ్యాలి."

"చెయ్యాలి మరి సమయం వస్తే."

"ఎన్నాళ్ళకి తీరుతుందీ?"

"ఎన్నాళ్లకి తీరుతుందీ అంటూ మంచి సమ్మంధం విడిచిపెట్టుకుంటాముటండీ? ఆస్తి అంతా దానిదే గనక రుణమో పణమో వాళ్ళే చూసుకుంటారు."

"వాళ్ళకి వెళ్ళేటప్పటికి యేమేనా మిగులుతుందా?"

"మిగల్చాలి. యీ మాత్రం రుణానికే మిగలకపోవడం యేమిటీ? శుభం అంటూ పెళ్ళి చెయ్యబోతూ అలా అగాయిత్యం మాటలంటారేమిటండీ?"

"నీకేం తెలుసును కష్టమూ, సుఖమూను?"

"అవునలాగే. చిన్నప్పణ్ణుంచీ యింటి దగ్గిర కూచోడమే గాని వక్క దమ్మిడీ సంపాదించిన పాపాన్ని పోయారా? ఎంత పోరినా లాభం లేకపోయింది. అప్పుడలా కూచుని యిప్పుడిలా అంటే యెలాగా? ఏమయినా సరే. ఈ సమ్మంధం దాటిపోనివ్వడానికి వీల్లేదు. ఇదే చెప్పడం ఆపైని మీ యిష్టం."

ఇట్లు చెప్పి సోదెమ్మ చివాలున లేచి పెరటి లోనికి పోయెను.

గోపాలయ్యకు ఒక గంట ఒడలు తెలియలేదు. చేయునది లేక తుదకాతడు అన్నిటికి నంగీకరించి యీసంగతి పురోహితుని ద్వారా వారికి తెలిపెను. వెంటనే లచ్చయ్యయు, భార్యయు వచ్చి వారిని విందుకు పిలుచుకొని పోయిరి. విందు సమయమున సోదెమ్మ వియ్యపురాలితో ఖడ్గవాదము చేసి ఆమె మాత్రము అరకాసులతో తృప్తి పొందునట్లు ఒప్పించెను. ఈ ప్రయోజకత్వమును ఆమె సగర్వముగనే భర్త కెరిగించెను; గాని అతడామాట విని ఉత్సాహము చూపలేదు.

## ⑤

సూర్యాస్తమయమగుచుండగా పెళ్ళివారు వచ్చి గారపాటి వారి పశువులశాల వద్ద విడిసిరి. బాకా చప్పుడు విని గోపాలయ్య సకుటుంబ పరివారముగ పానకపు కావిళ్ళు పట్టించుకొని యెదురు వెళ్ళెను. "దండిగానే వచ్చారు పెళ్ళివారు. ఆడాళ్ళు యెక్కువ వున్నట్టున్నారు మొగాళ్ళకంటే. యెలాగయినా వందమంది వుంటారు" అని ఆడుపెళ్ళి వారు చెప్పుకొనిరి.

ఎండలు ప్రారంభమగుట చేతను, మాచవరము రేవు దాటిన తరువాత మంచినీళ్ళు లభింపకపోవుట చేతను, తృష్ణోపహతులై వచ్చిన వారందఱును పానకము పుచ్చుకొనసాగిరి. "ఏదో లాంఛనానికి గాని యీరోజుల్లో పానకం తాగీ వారెవరయ్యా?" అని కొట్టుపెత్తనదారు ఒక లిక్కి బిందెడు మాత్రమే చేయించి దానిని రెండు బిందెలలోను పోయించుకొని వచ్చుటచే సగము మంది పుచ్చుకొను నప్పటికి బిందెలు ఖాళీ యయ్యెను. అయినను "మాకంటే మాక"ని ఇంకను పిల్లలు కొందరు వచ్చి మూగుటచే పానకపు బ్రాహ్మణుడు బిందెలు బోర్లించెను.

వెంటనే యిది నడిమి వయసు వారికి తెలిసెను. "పానకం అయిపోయిందీ" అని బ్రాహ్మణుడు వేశ్యల తాలూకు మనుష్యునకు చెప్పిన జవాబు గూడా వినబడియెను. తోడనే అక్కడకు పదిమంది యురికిరి. "పానకం కొంచెం

యెందుకు తేవాలీ? యిది యెండాకాలానికి మొదలనుకున్నావా, వానాకాలం అనుకున్నావా? మీ యజమాన్లు బెల్లం యివ్వకపోతే పానకం పేరు దేవుడెరుగును మంచినీళ్ళేనా పట్టుకు రావయ్యా. మా కోనసీమకి వస్తే కొబ్బరికాయలతో కప్పెడతాం. యింతే మీ మర్యాదా?" అని యొకడు జాడించి పలికెను. "తొందరపడకండిరా. యజమానుడికి తెలిస్తే నుంచున్న పాళంగా నాలుక్కావిళ్ళ పానకం తెప్పిస్తాడు. యివి చెరుకుతోటల వూళ్ళురోయి" అని యొకడనియెను. నలుగురును నాలుగు మాటలు ననిరి. గందరగోళము ప్రబలినది. ఇది విని సోదెమ్మ "అక్కడ యేదో అంటుకుంది వెళ్ళండీ" అనగా గోపాలయ్య వెళ్ళి బతిమాలి సమీపమున తిరుగుచున్న చెఱకు గానుగు వద్ద నుండి గూనెడు పానకమును తెప్పించి మర్యాద తక్కించుకొనియెను. బిందెలు చిన్నవగుటచే ఆడపడుచు పానకము పుచ్చుకొనుటకు తిరస్కరించెను.

ఆరాత్రి మరియేమియు గొడవలు లేకుండ గడచిపోయెను. ఉదయము స్నాతకమయ్యెను. సంధ్యాలగ్నమున పెండ్లికూడ అయిపోయినది. అంతట ఆడుపెళ్ళివారికి పూచీయు, మగపెళ్ళివారికి బింకమును బిగిసెను.

నిశ్చయించుకొనిన లాంఛనములన్నియు సరిగనే జరిగెను; గాని రెండవనాటి రాత్రి మగపెళ్ళివారు పనసకాయ కూర లేదనిపించిరి. సదస్యము నాడు నేయి లేదనిపించుటకు ప్రయత్నించి విఫలులగుటయే కాక ఒకరిద్దరు రామచంద్రపురము ఆసుపత్రికి గూడ వెళ్ళిరి. మూడవ నాటి రాత్రి మిఠాయి వడ్డింపలేమనిపించిరి. నాలుగవనాడు పప్పు, నేయి కలిపిన అన్నముతో గోడలకు పిడకలు చఱిచి పప్పులేదనిపించిరి. నాడు వడ్డనకు వచ్చిన ఒక ముసలి బ్రాహ్మణుని గుంజి విడిచిరి. మజ్జిగ కాలువలు కట్టించిరి. పులుసులోని ముక్కలతో ఆనకట్టలు కట్టిరి. బూరెలలో నేయి వేసికొని విడిచివేసిరి. కొందఱు విస్తళ్ళలోనే చేతులు కడుగుకొనిరి.

ఇట్లు అనేక విధముల అల్లరి చేసి విసిగించి కాళ్ళు పట్టించుకొని విడిచిరి. రాయవరము నందలి రయితులందఱును బ్రాహ్మణుల భోజనపద్ధతులను కార్యక్రమములను నిరసించిరి.

"పంపకాలు చాలేయి గాద"నీ, "మర్యాద చేశారు కాద"నీ, "లోభుల"నీ, "తెలవక పడ్డామ"నీ, "పిల్ల యేమంత అందకత్తె అని పడ్డారమ్మా" అనీ, "వారి తాహతు తెలుసుకోకుండా యింతమందిమి రావడం మనదే తప్పు"నీ, "ఈవేపు సమ్మంధాలు మనం చేసుకోనే కూడద"నీ, యిట్లు అందఱు నన్నివిధములను అని వెడలిపోయిరి. పెళ్ళిలో శేషగిరిరావు ముఖము వికసించియున్నట్లు కాన్పింపలేదు. అందుకు సోదెమ్మ చాల వగచెను.

# 6

సంవత్సరాదికి రావలసినదని జాబు వ్రాయగా శేషగిరిరావు "వుత్తరం రాస్తారా?" అని కోపగించెను. "విజయదశమికి రావలసినద"ని చెన్నపట్టణము తంతికొట్టగా అతడు దానికి జవాబు వ్రాయలేదు. సంకురాత్రి పిలుపునకు గోపాలయ్య స్వయముగా వెళ్ళి సింగరు సైకిలు కొని యిచ్చి కోపము తీర్చి అల్లుని దీసికొని వచ్చెను.

చాలదని జామారు కట్టుకొనకయే శేషగిరిరావు వెడలిపోయెను. "మానాయన కట్టుకోందే మేమెలా పుచ్చుకుంటామూ?" అని వియ్యపురాలును, ఆడపడుచును గూడ బహుమతీలను తిరస్కరించిరి. చేయునది లేకయు, ఇంట సోదెమ్మ పోరు పడజాలకయు గోపాలయ్య వారు కోరినంతయు పురోహితుని ద్వారా పంపి వేసెను.

వారు వెళ్ళిన పది దినములకు నరసమ్మ ప్రథమ రజస్వల యయ్యెను. నక్షత్రము మంచిది కాదు. శాంతి చేసుకొన వలెను. ఈ వార్త విని వియ్యాలవారు విసుగుకొనిరి. శేషగిరిరావు చెన్నపట్టణము వెడలిపోయెను.

ఆరుమాసములు గడిచిపోయెను. అమలాపురము నుండి యుత్తరము రాలేదు. మదరాసునుండి జవాబు కూడ రాలేదు. "వూరుకుంటే యెలాగా? వెళ్ళిరండీ వోమాటూ! శాంతి అయితే గాని పిల్లాడు గుమ్మంలోకి రావడానికి వీల్లేదాయెను. మిమ్మల్ని కానట్లు అలా వూరుకుంటారేమండీ?" అని సోదెమ్మ పోరగా గోపాలయ్య అమలాపురము వెళ్ళెను.

వియ్యంకులిద్దరును ఆలోచించి మదరాసు తంతికొట్టగా "వారు నాకు కావలసిన లా పుస్తకములు కొనిస్తే కార్యానికి వస్తాను. లేకపోతే ప్రస్తుతం నాకోసం కబురంపక్కర్లేదు. కంపెనీవారిని కనుక్కోగా ప్లీడరుకి మొదట తప్పకుండా కావలసిన పుస్తకాలకి 800 రూపాయలవుతాయన్నారు" అని శేషగిరిరావు బదులు వ్రాసెను.

కన్నుల నీరు గ్రమ్మ గోపాలయ్య జవాబు చెప్పకుండ ఇంటికి వచ్చెను. సోదెమ్మ ఒక గడియ మ్రాన్పడి యుండి రెండవ గడియ రుంజుకొని మూడవ గడియ "యిలా పెంకితనం చూపిస్తాడనుకోలేదు. ఏం చెయ్యమూ? లెక్కలు చూసుకుంటే నాలుగు వేలు ముట్టచెప్పేము యిదివరకి. ఈ యెనిమిది వందలూ వాళ్లతోపాటే అనుకుందాం. యివ్వకపోతే పిల్లని యింటో పెట్టుకొన్నందుకు లోకులు గుడ్లు పీకరూ? యెలాగో వకలాగ పిల్లని వాళ్ళ యింటికి పంపేస్తే మన బరువు వదిలిపోతుంది. యిక తీసుగు రానేవద్దూ అతన్ని" అనియెను. గోపాలయ్యకు ఒడలు మండిపోయెను. "నువ్వే చేశావు మొదటి నుంచీనీ యిలాగ. ఈ దెబ్బతో క్రియదస్తావేజు రాయాలి. తరవాత రోజులెలా వెడతాయీ?" అని యాతడు గర్జించి మఱిపలుకకుండ వీథిలోనికి పోయెను.

## 7

వారముదినములు నిశ్శబ్దముగా గడచిపోయినది. తరువాత గోపాలయ్య నిర్లిప్తతను ప్రకటించుచు సోదెమ్మ యెట్లు చెప్పిన అట్లు చేసెను. అందులకు ఫలముగా ఋణదాతలు "సొమ్ముమాట యేం చెబుతావు?" అని యడిగి వున్న భూమి క్రియము వ్రాయించుకొనిరి.

నరసమ్మ మరల పుట్టిల్లు యెరుగదు. గోపాలయ్య యిప్పుడు బొండాడ రఘుపతి వద్ద గుమాస్తాగా వుండెను.

**గమనిక:** పై కథ లభించిన మేరకు ప్రచురించాం. పూర్తి కథ ఎవరైనా పంపితే మలిముద్రణలో ప్రచురిస్తాము. అసౌకర్యానికి చింతిస్తున్నాము - ప్రచురణకర్తలు.

*(ప్రభుద్ధాంధ్ర - అక్టోబరు, 1924)*